సాక్షి అనకాపల్లి

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



రాజకీయాలు చేస్తే చర్యలు

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షత వహిం చారు. వివిధ సమస్యలను చర్చించారు. 8లో



చీఫ్ సెక్రటరీకి సాదర స్వాగతం

విశాఖ: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి శనివారం విశాఖ వచ్చారు. విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది.



గరుడ వాహనంపై దేవదేవుడు

ఉపమాక వెంకన్న ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం గరుడ వాహన సేవ నేత్రపర్వంగా జరిగింది. 8లో

న్యూస్‌రీల్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం



హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు స్వాగతం పలుకుతున్న పోర్టు అధికారులు

సాక్షి, విశాఖపట్నం: రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం విశాఖ చేరుకున్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రధాన న్యాయమూర్తికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తదితరులు స్వాగతం పలికారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన నూతన న్యాయస్థానాల సముదాయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించనున్నారు.

ఏలేరు-తాండవ అనుసంధానానికి భూ సేకరణ



భూ సేకరణపై చర్చిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ నాయుడు, ఏలేరు కాలువ జేఈ అప్పలరాజు

నాతవరం: ఏలేరు-తాండవ రిజర్వాయర్ అనుసంధానానికి నిర్మించే ఎత్తిపోతల పథకం కో సం భూమి సేకరణ ప్రక్రియ జరుగుతోందని ఏలేరు కాలువ జేఈ అప్పలరాజు, తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. తహ సీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్ శా ఖ అధికారులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలేరు కాలువ.. తాండవ ప్రాజెక్టు మధ్యలో 11.6 కిలో మీటర్ల మేర రైతుల నుంచి భూమి తీసుకోవాలన్నారు. నాతవరం సమీపంలో లిఫ్ట్ ఏర్పాటుకు 2.5 కిలో మీటర్ల భూమి, గునుపూరు ప్రాంతంలో 800 మీటర్ల భూమి అవసరం ఉంటుందన్నారు. నాతవరం మండలంలో ఏలేరు కాలువపై లిఫ్ట్‌లు ఏర్పాటు చేసి నీటిని తరలించేందుకు 25 ఎకరాల భూమి అవసరం ఉంటుందన్నారు. రెండు జిల్లాల కలెక్టర్ల ఆదేశాల మేర కు అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చే శారన్నారు. అక్టోబరు నెలాఖరులోగా భూసేకరణ పూర్తి చేసి, నవంబరు లేదా డిసెంబరులో అనుసంధానం పనులు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

వైద్య రంగంలో సంస్కరణలు భేష్

- కేంద్ర బృందం ప్రశంసలు



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ రమణ

కశింకోట/యలమంచిలి/పాయకరావుపేట: వైద్య రంగంలో కొత్త సంస్కరణలతో ఏపీలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ (న్యూఢిల్లీ) ఇన్వెస్టిగేటర్ డాక్టర్ వై.వి.రమణ అన్నారు. కశింకోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, యలమంచిలి పట్టణంలోని సోమలింగపాలెం అర్బన్ క్లినిక్‌ను శనివారం కేంద్ర బృందం పరిశీలించింది. బృందానికి నేతృత్వం వహించిన డాక్టర్ రమణ కశింకోట పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు, ల్యాబ్‌లో పరీక్షల నిర్వహణ, మందుల పంపిణీ, రికార్డుల నిర్వహణ, రిపోర్టుల పరిశీలన, పరికరాల నిర్వహణ, వినియోగం తదితర విషయాలను పరిశీలించారు. ప్రసవాలు ఎక్కువగా జరుపుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సోమలింగపాలెం అర్బన్ క్లినిక్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పాయకరావుపేట పీహెచ్‌సీలో అందుతున్న సేవలను కేంద్ర బృందం పరిశీలించింది. వివిధ విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను డాక్టర్ బి.విద్యాసాగర్, డాక్టర్ వి.పద్మప్రియ వివరించారు. రీసెర్చ్ ఫెలో టి.శ్రీనివాస్, ఏఎంహెచ్‌ఎం ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ లూసీ, ఎస్‌వో రామచంద్రరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ వై.సౌమ్య పాల్గొన్నారు.

ఇదీ ముదపాక బండారుం



ముదపాక భూములు



దొంగే దొంగ అన్నట్టు ఉంది తెలుగుదేశం నేతల వ్యవహారం. టీడీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో భారీగా భూములను కబ్జా చేసి.. భూ రికార్డులను సైతం ట్యాంపరింగ్ చేసిన ఆ పార్టీ నేతలు ఓ వెలుగు వెలిగారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతల భూ కబ్జాలను ఎండగడుతూ వేల కోట్ల విలువైన భూములను తిరిగి ప్రభుత్వ భూ బ్యాంకులోకి చేర్చింది. గతంలో జరిగిన తప్పుడు సర్వేలను సరిచేస్తూ.. అర్హులకు న్యాయం చేసేలా ముందుకు సాగుతోంది. గత ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ నేతలు భూకబ్జాలు చేస్తున్నారంటూ తప్పుడు ఆరోపణలతో కొంత మేర లబ్ధి పొందిన టీడీపీ.. ఇప్పుడు ఎన్నికల ముందు అదే పంథాను అవలంబిస్తోంది. ఈ నేపథ్యంలో వాస్తవ విషయాలను ప్రజలకు వివరించేందుకు.. టీడీపీ నేతల భూదందాపై 'సాక్షి' వరుస కథనాలు అందించాలని నిర్ణయించింది. మొదటగా ముదపాక భూముల వ్యవహారంలో తప్పుడు జియోకాన్ సర్వేతో టీడీపీ నేతలు ఏ విధంగా చక్రం తిప్పారో ఇప్పుడు చూద్దాం.. – సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

- ముదపాక భూములను కొట్టేసేందుకు గత ప్రభుత్వం పన్నాగం
- టీడీపీ కార్యకర్తలు, నాయకులు పేర్లను సర్వేలో చేర్చిన వైనం
- అప్పటి ఎమ్మెల్యే బండారు కనుసన్నల్లోనే జియోకాన్ సర్వే
- ఇప్పటికీ ఆ భూములను కొల్లగొట్టేందుకు యత్నాలు
- అందుకే జగనన్న కాలనీలకు అడ్డు తగులుతున్న టీడీపీ నేతలు

పెందుర్తి మండలం ముదపాకలో 1, 38, 76 సర్వే నంబర్లలో సుమారు 955 ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. ఆయా భూములను 40 ఏళ్ల కిందట 450 మంది రైతులకు కేటాయిస్తూ పట్టాలు జారీ చేసింది. నాటి నుంచి ముదపాక, శివారు గ్రామం గోవిందపురం రైతులు ఆ భూముల్లో జీడి మామిడి, ఇతర పంటలు వేసి ఫలసాయం పొందే వారు. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ భూములకు గ్రహణం పట్టింది. 2015–16లో వీఎంఆర్డీఏ(అప్పట్లో వుడా) ఆయా భూములను ల్యాండ్ పూలింగ్ చేస్తుందన్న సమాచారంతో టీడీపీ నేతలు రంగంలోకి దిగారు. ల్యాండ్ పూలింగ్ ప్రకటన రాకముందే పక్కా ప్రణాళిక రచించారు. స్థానికంగా ఉన్న తమ బినామీల సాయంతో 'త్వరలో ప్రభుత్వం మీ భూములను లాక్కొంటుంది. అప్పుడు ఎకరాకు రూ.2 లక్షలకు మించి ఇవ్వదు. అదే మాకు ఆ భూములు ఇచ్చేస్తే రూ.10 లక్షలు ఇస్తాం' అని రైతులను ఆందోళనకు గురిచేసేలా ప్రచారం చేశారు. దీంతో అయోమయానికి గురైన రైతులు బినామీలు చెప్పినట్లే అడ్వాన్స్ కింద రూ.లక్ష, రెండు లక్షల చొప్పున తీసుకుని వారు ఎక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడ పెట్టేశారు. దాదాపు 320 పట్టాలను ఇలా తెగనమ్ముకున్నారు. సుమారుగా 500 ఎకరాల భూములను మొత్తంగా రూ.10కోట్ల వరకు విక్రయించేశారు. వాస్తవంగా వీఎంఆర్డీఏ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.200కోట్లకు పైనే ఉంటుంది.

సర్వేలోనే మాయాజాలం

'ముదపాక అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులు మాయమయ్యాయి. ఇక్కడ ఎన్ని ఎకరాల భూములన్నాయి.? ఎంత మంది రైతులకు ఆ భూములు కేటాయించారన్నది తెలియడం లేదు. ఆ రికార్డులు వెతికే పనిలో ఉన్నాం.' అని చెబుతూ ప్రభుత్వ ఆదేశాలతో జియోకాన్ సంస్థతో కలిసి అప్పటి అధికారులు సర్వే నిర్వహించారు. అయితే ఈ సర్వేలోనే అసలైన మాయాజాలం చోటుచేసుకుంటోంది. అప్పటి ప్రభుత్వం అండతో టీడీపీ నేతలు రైతులను భయపెట్టి లాక్కొన్న పట్టాలకు.. పుట్టుకొచ్చిన నకిలీ పట్టాదారులకు లబ్ధి చేకూర్చేలా సర్వే నిర్వహించారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

రికార్డుల మాయాజాలం

ఈ విషయం తెలుసుకున్న అధికార యంత్రాంగం.. ముదపాక రికార్డులను పరిశీలించేందుకు ప్రయత్నించింది. అయితే సర్వే నంబర్లు 1, 38, 76లకు సంబంధించిన ఏ రికార్డులు లేవని స్థానిక రెవెన్యూ అధికారులు అసలు విషయం చెప్పారు. దీంతో చేసేది లేక ఆ రికార్డులు లేవని ప్రకటన చేస్తూ.. ఆ భూముల్లో ప్రస్తుతం అనుభవంలో ఉన్న రైతుల ఆధారంగా సర్వే చేసి అందరికీ న్యాయం చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ.. మరుసటి రోజే సర్వే నంబర్లు 1, 38లకు సంబంధించిన రికార్డులు లభించినట్లు ప్రచారం జరిగింది. వివాదానికి కేంద్ర బిందువైన సర్వే నంబర్ 76 రికార్డులపై స్పష్టత లభించలేదు. ఈ సర్వే నంబర్‌లోని భూముల్లోనే ఆక్రమణదారులు అక్రమంగా చెట్లు నరికేయడంతో పాటు రోడ్లు వేశారు. ఇదే సర్వేలోని భూముల నుంచి ఆక్రమణ పర్వానికి తెరతీశారు. అందుకే 76 సర్వే నంబర్ రికార్డులు మాయమయ్యాయని స్పష్టమవుతుంది.

అంతా ఆయన కనుసన్నల్లోనే..

2017–2018 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం భూమి లేని పేదలకు గృహ నిర్మాణ పథకం కోసం ల్యాండ్ పూలింగ్ చేయాలని నిర్ణయించింది. ముదపాకలోని సర్వే నంబర్ 1, 76, 38లో అసైన్డ్‌దారులు, ఆక్రమణదారుల అంగీకారం తీసుకొని ఆ భూముల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించింది. జియోకాన్ సర్వే ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ సాంకేతిక సహకారంతో రెవెన్యూ, సర్వే విభాగాలు సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. ఇక్కడే టీడీపీ నేతలు చక్రం తిప్పారు. అక్కడ భూములు లేకపోయినా.. కొంతమంది టీడీపీ అనుచరుల పేర్లని సర్వేలో పొందుపరిచారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములను తమ కబంధ హస్తాల్లోకి తీసుకునేందుకు పావులు కదిపారు. ఈ ఎంజాయ్‌మెంట్ సర్వేలో అవకతవకలు జరుగుతున్నాయని గుర్తించిన అప్పటి ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నేతలతో పాటు బీజేపీ, వామపక్షాలు, ఇతర రాజకీయపార్టీలు వ్యతిరేకించాయి. ముదపాక భూముల్లో జరుగుతున్న అడ్డగోలు సర్వేను నిలుపుదల చేయాలంటూ ఆ భూముల వద్దనే ధర్నాలు చేశాయి. దీనిపై స్పందించిన అప్పటి అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే పక్కాగా నిర్వహించేందుకు రెవెన్యూ, సర్వే, హార్టికల్చర్, వ్యవసాయ శాఖలతో కూడిన ఐదు బృందాలను ఏర్పాటు చేసినా.. టీడీపీ నేతలు మాత్రం తమ హస్తలాఘవాన్ని ప్రదర్శించారు. ముదపాకలో భూ రాబందులు వాలి.. ఆ భూములను కబ్జా చేసేస్తున్నాయంటూ నినదించినా.. సర్వేను బండారు, అతని అనుచరులు అనుకూలంగా మార్చేసుకున్నారు. అందుకే ఇటీవల ఆ ప్రాంతంలో నిరుపేద లబ్ధిదారులకు జగనన్న కాలనీల నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంటే.. దాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నేతలు నానాయాగీ చేస్తున్నారు. తాము అడ్డగోలుగా దోచుకున్న భూములను పేదల పరం చేస్తుంటే ఓర్వ లేక ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా అధికారులపై, ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అయినప్పటికీ అర్హులకు అన్యాయం జరగకుండా.. పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతోంది.

నెరవేరనున్న ఉత్తరాంధ్రుల కల

- **విశాఖ** కేంద్రంగా సుపరిపాలన
- **వికేంద్రీ**కరణతో సమగ్రాభివృద్ధి
- **ఎంపీ** డాక్టర్ సత్యవతి



బొజ్జన్నకొండను పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి, బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి టౌన్: పరిపాలనా వికేంద్రీకరణతో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతోందని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని, ఉత్తరాంధ్రుల కల నెరవేరనుందని చెప్పారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లాల వరకు అభివృద్ధి చెందడమే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు విశాఖలో ఏర్పాటవుతాయన్నారు. ముంబై వంటి మహా నగరాల సరసన విశాఖ చేరబోతోందన్నారు. 27 ఏళ్ల నుంచి ఆమోదానికి నోచుకోని మహిళా బిల్లు ఆమోదం పొందటం మహిళల గౌరవాన్ని పెంచుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గ్రామీణ స్థాయి నుంచి అన్ని పదవుల్లోను మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. పీఎం జన్మదిన వేడుకల్లో భాగంగా జిల్లాలో ఈనెల 26 నుంచి 29 వరకు దివ్యాంగులకు ఉచిత భారీ వైద్య శిబిరాలు నిర్వహించి, వారికి కావాల్సిన పరికరాలు అందజేస్తామన్నారు. మహిళా బిల్లు పాస్ అయిన సందర్భంగా కేక్ కట్ చేసి మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకి రామరాజు, జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

శంకరం గ్రామంలో ఆదివారం జరగనున్న బొజ్జన్న కొండ అభివృద్ధి పనుల శంకుస్థాపన ఏర్పాట్లను ఎంపీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బొజ్జన్నకొండకు 2 వేల సంవత్సరాల చరిత్ర ఉందని, ఈ కొండను టూరిస్ట్‌లు మెచ్చేలా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.

పర్యాటక ఆరామం

- స్వదేశీ దర్శన్ స్కీంలో బొజ్జన్నకొండ అభివృద్ధికి నేడే శ్రీకారం
- రూ.7.30 కోట్లు మంజూరు చేసిన కేంద్ర పర్యాటక శాఖ
- 1.4 ఎకరాల స్థలం కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- బుద్ధిస్ట్ సర్క్యూట్‌కు శంకుస్థాపన చేయనున్న వైవీ సుబ్బారెడ్డి



బొజ్జన్నకొండ బౌద్ధారామం ముఖద్వారం

సాక్షి, అనకాపల్లి: ప్రాచీన బౌద్ధారామం బొజ్జన్నకొండ పర్యాటక ఆరామంగా అభివృద్ధి చెందనుంది. స్వదేశీ దర్శన్ స్కీంలో భాగంగా బుద్ధిస్ట్ సర్క్యూట్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర పర్యాటక శాఖ నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి హాజరుకానున్నారు. పర్యాటక కేంద్రంగా ప్రాచుర్యం పొందిన బొజ్జన్నకొండను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్రం రూ.7.30 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు 1.4 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది. మౌలిక వసతులు, విద్యుత్, సీసీ టీవీ, ధ్యాన్ బుద్ధ పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి బొజ్జన్నకొండ అభివృద్ధి పనులు పూర్తికానున్నాయి.

బొజ్జన్నకొండ ప్రత్యేకత ఇదీ..

బౌద్ధ వారసత్వ ప్రదేశాల్లో ప్రధానమైన వాటిలో బొజ్జన్నకొండ ఒకటి. ఇది తూర్పు కొండపై ఉంది. ఏకశిలా స్థూపాలు, రాక్-కట్ ప్లాట్‌ఫామ్‌లు, మహాస్థూపం ఇక్కడ కనువిందు చేస్తాయి. దీని గోపురాన్ని పూర్తిగా ఇటుకలతో తయారు చేశారు. పురావస్తు తవ్వకాల్లో లభించిన పురాతన బౌద్ధ నాణేలు ఆకర్షణగా ఉంటాయి. రాతి గుహల గోడలపై కనిపించే కళాఖండాలు సందర్శకులను అలరిస్తాయి.

నిధులు కేటాయించారిలా..

బొజ్జన్నకొండ అభివృద్ధికి మొత్తం రూ.7.32 కోట్లు మంజూరు చేశారు. టూరిస్ట్ ఎమినిటీ పార్కింగ్, బుద్ధిస్ట్ కల్చరల్ సెంటర్ (రెస్టారెంట్, క్లాక్ రూం, మెడిటేషన్, పార్కింగ్ సదుపాయం) అభివృద్ధికి రూ.37.44 లక్షలు కేటాయించారు. టూరిస్ట్ ఎమినిటీ సెంటర్ ఏర్పాటుకు 182.89 లక్షలు, మౌంటైన్ లైటింగ్‌కు రూ.28 లక్షలు, బుద్ధిస్ట్ తోరణం ఏర్పాటుకు రూ.7.34 లక్షలు, లైట్ అండ్ సౌండ్‌కు రూ.472 లక్షలు, సీసీ టీవీ ఏర్పాటుకు రూ.2.32 లక్షలు, వైఫై సదుపాయానికి రూ.2.50 లక్షలు మంజూరు చేశారు.

'పాల వెల్లువ' మరింత పెరగాలి

తుమ్మపాల : జగనన్న పాలవెల్లువ సేకరణ మరింత పెరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన జిల్లాకు చెందిన ఏడు మండలాల అధికారులతో సమావేశమయ్యారు. కోటవురట్ల, రాంబిల్లి, ఎస్.రాయవరం, నాతవరం, మాకవరపాలెం, నర్సీపట్నం, పాయకరావుపేట తదితర 112 గ్రామాల్లో పాలవెల్లువ కోసం బిల్డింగ్, కార్యదర్శి, ప్రమోటర్లను చూడాల్సిందిగా మండల అధికారులు, ఎంపీడీవో, పశువైద్య అధికారులకు సూచించారు. జిల్లా పశు వైద్య అధికారి ప్రసాదరావు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

నెలవారీ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి రాజకీయ పార్టీల నేతలతో కలిసి శనివారం స్ట్రాంగ్‌రూమ్‌ని పరిశీలించారు. ఎన్నికల సూపరింటెండెంట్ చిన్నికృష్ణ, గొర్లె సూరిబాబు (వైఎస్సార్‌సీపీ), సీహెచ్.నాగేశ్వరరావు (బీజేపీ), బి.శ్రీనివాసరావు (టీడీపీ) తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సినీ నిర్మాత నట్టి కుమార్ కక్షసాధింపు చర్యలు

- వెంకన్నపాలెం రైస్‌మిల్లు యజమాని సందీప్

చోడవరం: సినీ నిర్మాత నట్టికుమార్ తమపై కక్షసాధింపు చర్యలతోనే ఫిర్యాదులు చేస్తున్నారని వాసవి రైస్ మిల్లు నిర్వాహకుడు పూసర్ల సందీప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని వెంకన్నపాలెంలో వాసవి రైస్ మిల్లులో అవకతవకలపై విచారణ చేయాలంటూ సీఐడీకి నట్టి కుమార్ ఫిర్యాదు చేయడం, ఆపై విచారణ చేయాలని కలెక్టర్‌కు సీఐడీ ఏడీజీపీ తాజాగా ఆదేశాలు ఇచ్చారు. దీనిపై రైస్ మిల్లు యజమాని సందీప్ మాట్లాడారు. చోడవరంలో తమ పిత్రార్జితంగా ఉన్న పూర్ణా సినిమా థియేటర్‌ను గతంలో నట్టికుమార్‌కు లీజ్‌కు ఇచ్చామన్నారు. లీజ్ గడువు పూర్తయినా బకాయి అద్దె డబ్బులు ఇవ్వలేదని, దీనిపై హైకోర్టుకు వెళ్లామన్నారు. అద్దె డబ్బులు చెల్లించాలని, సినిమా హాలును ఖాళీ చేయాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అతడు తాత్సారం చేస్తున్నారని వాపోయారు. తాము సినిమా హాలు ఖాళీ చేయాలని అడిగినప్పుడల్లా తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని ఆరోపించారు. తమ రైస్ మిల్లు నిర్వహణపై ఎటువంటి విచారణ చేసినా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇదే విషయమై నట్టి కుమార్ మాట్లాడుతూ మిల్లులో అవకతవకలపై గతంలో కలెక్టర్‌కు, విజిలెన్స్, అన్ని ప్రభుత్వ శాఖలకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, అందుకే సీఐడీకి ఫిర్యాదు చేశామన్నారు.

ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేట సమీపంలో రాజచెరువు మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు శనివారం సాయంత్రం ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో నాగయ్యపేటకు చెందిన షేక్ మదీనా కుడి కాలు, ఎడమ భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. చీడికాడ మండలం నీలంపేట కొత్తూరు చెందిన వంటాకు శ్రీరామమూర్తి కుడి కాలు, కుడి చెయ్యికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కుటుంబ సభ్యులు 108 వాహనంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. షేక్ మదీనా దేవరాపల్లి నుంచి వస్తుండగా, వంటాకు శ్రీరామమూర్తి తన కుమారుడు హేమంత్‌కుమార్‌ని విజయనగరంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చేర్పించి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

రాజకీయాలు చేసే టీచర్లపై చర్యలు

- అల్లూరి జిల్లాలో విద్య, వైద్యం మెరుగు పడాలి
- అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ వ్యాఖ్యలతో దుమారం
- 'జెడ్పీ స్థాయీ' సమావేశాల్లో పలు అంశాలపై సభ్యుల చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పక్కన జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి

సాక్షి, విశాఖపట్నం: 'ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో చాలామంది టీచర్లు రాజకీయాలు చేస్తున్నారు. అలాంటి వారిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో మిమ్మల్ని బాధ్యులను చేస్తూ మీపై మేమే చర్యలు తీసుకుంటాం' అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర హెచ్చరించారు. శనివారం ఒకటి నుంచి ఏడు వరకు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగాయి. విద్యపై జరిగిన చర్చలో సభ్యులు కొంతమంది ఉపాధ్యాయుల తీరును ఆక్షేపించారు. ఇలాంటి వారు విద్యా బోధన కంటే రాజకీయాలు చేయడంపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని ఆరోపించారు. మునగపాక మండలం రాజుపేటలో స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రస్తుత సర్పంచ్‌తో కాకుండా మాజీ సర్పంచ్‌తో అక్కడి ఉపాధ్యాయుడు పతాకావిష్కరణ జరిపించారని, కానీ ఆయనపై ఏమీ చర్యలు తీసుకోలేదని ఆ జెడ్పీటీసీ సత్యనారాయణ సమావేశంలో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుపడడం లేదని, టీచర్ల బోధనపై ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదని పెదబయలు, అరకు జెడ్పీటీసీలు మత్స్యలింగం, శెట్టి రోషిణిలు చెప్పారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ పై విధంగా స్పందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ సదుపాయాన్ని ప్రజలు వినియోగించుకునేలా సభ్యులు అవగాహన కల్పించాలని విశాఖ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు కోరారు. ఆయుష్మాన్‌భవ హెల్త్ కార్డులను అందరూ ఆన్‌లైన్ చేయించుకునేలా సహకరించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ అభ్యర్థించారు.

జగనన్న ఇళ్లపై సమీక్షించండి..

జగనన్న కాలనీ ఇళ్లపై మండల స్థాయిలో తరచూ అధికారులు సమీక్షించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర సూచించారు. వీటి నిర్మాణం సత్వరమే పూర్తయ్యేలా చూడాలన్నారు. గొలుగొండ మండలంలో జగనన్న కాలనీ ఇళ్లను కొంతమంది లబ్ధిదార్లు వేరొకరికి అమ్ముకుంటున్నారని, వారి బిల్లుల చెల్లింపులు నిలిపివేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆ మండల జెడ్పీటీసీ గిరిబాబు కోరారు. ప్రభుత్వం సొంత స్థలాలున్న వారికి కూడా జగనన్న కాలనీ ఇళ్లను మంజూరు చేస్తోందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులు జెడ్పీటీసీలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర అధికారులను ఆదేశించారు.

డీఆర్‌డీఏ పీడీ వ్యాఖ్యలపై ఆగ్రహం..

సమావేశంలో వైఎస్సార్ పెళ్లి కానుకకు అర్హతలపై స్పష్టతనివ్వాలని దేవరాపల్లి జెడ్పీటీసీ సత్యం అనకాపల్లి డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతిని కోరారు. దీనిపై ఆయన.. 'మీకు ఈ సందేహం రావడం దురదృష్టకరం' అంటూ వ్యాఖ్యానించారు. ఆపై తమ మండలంలో స్త్రీనిధిలో జరిగిన అవినీతిపై అధికారులకు, మంత్రికి ఫిర్యాదు చేసినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదని సత్యం అన్నారు. దీనిపై ఆగ్రహం చెందిన పీడీ లక్ష్మీపతి.. ఆ వ్యవహారంలో ఏం జరిగిందో మంత్రికి ఫోన్ కలిపి మాట్లాడమంటారా? అంటూ దురుసుగా సమాధానం చెప్పారు. పీడీ వ్యాఖ్యలపై సభ్యులు అభ్యంతరం చెప్పడంతో జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి ఆయనను మందలించారు.

నిందితులకు కఠిన శిక్ష పడేలా కేసుల విచారణ

- రోజూ సమీక్షించి దర్యాప్తు వేగవంతం చేయాలి
- నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా కేసుల విచారణ వేగవంతం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ, తీవ్రమైన, ప్రాపర్టీ, పోక్సో యాక్ట్, 147 సీఆర్పీసీ, గంజాయి, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆయన సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు, పెండింగ్‌లో ఉండడానికి కారణాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు. రౌడీషీటర్ల భౌతిక దాడులు, కబ్జా, నేరాలు, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న కేసులపై అధికారులు రోజూ సమీక్షించి దర్యాప్తు వేగవంతం చేసి కోర్టులో నేరాభియోగపత్రం సమర్పించాలన్నారు. సాక్షులు సమయానికి హాజరుపరుస్తూ కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సమన్వయం చేసుకుంటూ పని చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలో నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెంచాలని, అటువంటి వారిపై పీడీయాక్ట్ నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనోత్సవాల్లో ఘర్షణలకు తావివ్వకుండా, అశ్లీల కార్యక్రమాలు వంటివి ముందస్తు సమాచారంతో కట్టడి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే, స్టేట్ హైవేలలో హైవే మొబైల్స్ ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. వాహనాల నిలపకుండా వాటికి కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేసేలా హైవే మొబైల్స్ ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, మద్యం సేవించడం, హెల్మెంట్ ధరించిన వాహనదారులపై ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ క్రైం నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. జైలు నుంచి విడుదలైన ఖైదీలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అంతకుముందు విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన 35 మంది అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలతోపాటు నగదు రివార్డులు అందించి ఎస్పీ సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, అదనపు ఎస్పీ(క్రైం) పి.సత్యనారాయణరావు, నర్సీపట్నం డివిజన్ అదనపు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, డీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, వెంకటరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు



కూలిన రెస్టారెంట్

అనకాపల్లి టౌన్: గుర్తు తెలియని వ్యక్తులు రెస్టారెంట్‌ను కూల్చివేశారంటూ సదరు యజమాని నక్కా వంశీకృష్ణ పట్టణ పోలీసులను శనివారం ఆశ్రయించాడు. సీఐ దాడి మోహనరావు వివరాల ప్రకారం... మండలంలోని కొత్తూరు గ్రామంలో రామకృష్ణకు చెందిన స్థలాన్ని మూడేళ్ల క్రితం నక్కా వంశీకృష్ణ లీజుకు తీసుకుని రెస్టారెంట్ నడుపుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని కూల్చి వేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రెస్టారెంట్ కూల్చివేసిన వారిని పట్టుకునేందుకు కేసు దర్యాప్తు ముమ్మరం చేస్తామని సీఐ తెలిపారు. ఈ స్థల విషయంపై డిప్యూటీ తహసీల్దారు శ్రీరామ్మూర్తిని సాక్షి వివరణ కోరగా ఇది ప్రభుత్వ స్థలమని, రెస్టారెంట్ కూల్చినవారెవరో తమకు తెలియదన్నారు.

దత్తక్షేత్రంలో గణపతికి క్షీరాభిషేకం, తిలకహోమం



అనకాపల్లి టౌన్: గ్రేటర్ విశాఖలో విలీన గ్రామమైన సిరసపల్లి వద్ద చింతామణి దత్తక్షేత్రంలో శనివారం స్వామివారికి క్షీరాభిషేకం, తిలహోమం జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనకు భక్తులు హాజరయ్యారు. ఇక్కడ ఆరు రోజులుగా గణపతి నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని, ఆఖరి రోజు ఈనెల 26న స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు, 21 పత్రాలతో పూజలు నిర్వహించనున్నామని క్షేత్రం నిర్వాహకుడు ఎం.ఆంజనేయరాజు తెలిపారు.

పసుపు అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు



చోడవరం: పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో కార్యసిద్ధి వినాయకుడు పసుపు అలంకరణలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. ఆలయ ప్ర ధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వ ర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారుడు ఏఆర్జీ శర్మ వేసిన సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటికాపరి ఘట్టం అందర్నీ ఆకట్టుకుంది.

గరుడ వాహనంపై దేవ దేవుడు

- నేత్రపర్వంగా వసంతోత్సవం
- ఉపమాకలో ఘనంగా బ్రహ్మోత్సవాలు



గరుడ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం, టీటీడీ అనుబంధ దేవాలయం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కల్కి అవతారంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం, నిత్యార్చనలు నిర్వహిస్తున్నారు. కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి, అండాళ్లమ్మవారికి నిత్యార్చనలు అభిషేకాలు నిర్వహించి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామ బలిహరణలు పూర్తి చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. స్వామివారికి పగలు, రాత్రిపూట వివిధ వాహనాల్లో తిరువీధి సేవలు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా పేర్కొనే స్వామివారి గరుడ వాహన సేవ శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవీభూదేవీ సమేత దేవ దేవుడిని ఇత్తడి గరుడ వాహనంపై ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరువీధి సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి గ్రామ బలిహరణలు పూర్తి చేశారు. తదుపరి స్వామివారికి ఆలయంలో నీరాజన మంత్రపుష్పాలు తీర్థ గోష్టి నిర్వహించారు. సాయంత్రం విశేష ఉత్సవంలో భాగంగా ఆస్థాన మండపంలో స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సప్తరుషి ఆవాహనం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఇత్తడి గరుడ వాహనంపై తిరువీధి సేవలకు తీసుకెళ్లారు. స్వామివారి వెంట భక్తులు తరలివెళ్లారు. వసంతోత్సవంలో భాగంగా చూర్ణాన్ని, పసుపు, కుంకుమ కలిపిన జలాలను భక్తులు ఒకరిపై ఒకరు జల్లుకున్నారు. గరుడ సేవ, శనివారం కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో దాతల సహకారంతో సుమారు వెయ్యి మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, పి.వి.శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

కాకర నూకరాజు మృతి కళా రంగానికి తీరని లోటు

నక్కపల్లి: పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే కాకర నూకరాజు మరణం రంగస్థల, పౌరాణిక కళా రంగానికి తీరని లోటని లఘు చిత్రాల దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో సిహెచ్.ఎల్.పురానికి చెందిన తాను 2004లో కాకర నూకరాజుతో కలసి పిల్లలు కాదు పిడుగులు చిత్రాన్ని తీశానని, రేవు పోలవరం, చినగుమ్ములూరు, గుడివాడ, ఏటికొప్పాక ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహించామన్నారు. ఛత్రపతి శివాజీ బయోపిక్ తీయాలన్నది కాకర నూకరాజు బలమైన కోరిక అన్నారు. ఇది తీరకుండానే ఆయన దైవ సన్నిధికి చేరారన్నారు. ఆయన మరణానికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

క్లుప్తంగా

శ్రీనివాసుని పవిత్రోత్సవాలు



స్వామివారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

అనకాపల్లిటౌన్: దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి పవిత్రోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. స్వామివారి ఉత్సవవిగ్రహాలకు అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబులు పంచామృతాభిషేకం చేపట్టారు. స్వామివారిని దర్శనం కోసం హాజరైన భక్తులతో ఆలయం కిట కిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సకలా గోవిందరావు, ఆలయ ఈవో కె.ఆదినారాయణ, ధర్మకర్తలు శ్రీధరాల కోమలి, సుంకర వెంకటేశ్వరరావు, ఉమ్మిని పైడిరాజు, ఆలయ కమిటీ సభ్యులు సూరిశెట్టి చిన సన్యాసిరావు, బెల్లాన అనురాధ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పద్య విహార్



వేమన శతకంలో పద్యాలు వినిపిస్తున్న విద్యార్థి

కశింకోట : కశింకోటలోని బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వివేకానంద విద్యా సంస్థల్లో శనివారం పద్య విహార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన శతకంలోని పద్యాలను విద్యార్థులు రాగయుక్తంగా వల్లె వేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కోటారావు, బొడ్డేడ బలరామస్వామి, రమాదేవి, కందాల శ్రీలక్ష్మి, సంగీతలక్ష్మిలను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. సంఘం గౌరవాధ్యక్షుడు వేదుల వెంకటశాస్త్రి, స్కూలు కరస్పాండెంట్ మళ్ల జగదీష్, ప్రతినిధులు మొక్కరాల కిషోర్‌కుమార్, కొడుకుల సత్యవతి, కందాల సూర్య జగన్నాథ్, శ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు పీఏసీఎస్ సమావేశం

అనకాపల్లిటౌన్: మండలంలో తుమ్మపాల అన్నపూర్ణబ్యాంకు(పీఏసీఎస్) సర్వసభ్య సమావేశం ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ పి.డి.గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సోదరులు, నాయకులు, బ్యాంకు సభ్యత్వం గల మెంబర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

అనకాపల్లి సినిమాలు

7/జీ బృందావనకాలనీ(మార్నింగ్, సెకండ్‌షో)
వారెవ్వా జతగాళ్లు(మధ్యాహ్నం- సాయంత్రం) : రాజా
మార్క్ ఆంటోని : సత్యనారాయణస్క్రీన్-1
కలవరుడు : సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి : షిర్డిసాయి
జవాన్ : పర్తిసాయి
జవాన్ : వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్ : శ్రీసత్య
ఎక్స్‌పెండబుల్స్4 : రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 399 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,090	4,420
రెండో రకం	3,950	4,080
మూడోరకం	3,700	4,020

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యూ.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 359 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 252 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

దివ్యాంగులకు ఊతం..

- నియోజకవర్గంలో అర్హులకు ఉపకరణాల పంపిణీ
- ఈనెల 26న ఏఎంఏఎల్ కళాశాలలో సదరం క్యాంపు
- హైదరాబాద్ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఉపకరణాల సరఫరా



గతంలో అలిమ్‌కో పంపిణీ చేసిన బ్యాటరీ ట్రైసైకిళ్లపై దివ్యాంగులు (ఫైల్)

తుమ్మపాల: దివ్యాంగులకు ఊతమిచ్చేలా దివ్యాంగ ఉపకరణాల పంపిణీకి ఎంపీ బి.వి.సత్యవతి చేసిన కృషి ఫలించింది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం అలిమ్-కో ద్వారా విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలు సరఫరా చేయడానికి జిల్లా యంత్రాంగం సమాయత్తమైంది. ఈమేరకు జిల్లాలో నాలుగు కేంద్రాల ద్వారా దివ్యాంగుల వివరాలు సేకరించి వారికి కావాల్సిన ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మండలంలో కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో ఈనెల 26న అనకాపల్లి పట్టణంతోపాటు మండలం, కశింకోట, అచ్యుతాపురం, మునగపాక, పరవాడ, సబ్బవరం మండలాలకు చెందిన దివ్యాంగులకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించి అర్హులైన దివ్యాంగులకు పలు రకాల ఉపకరణాలు అందజేయనుంది.

గుర్తింపుకార్డు తప్పనిసరి...

ఉపకరణాలు పొందే దివ్యాంగులు మెడికల్ బోర్డు ద్వారా జారీ చేసిన సదరం ధ్రువీకరణపత్రం(40 శాతం లేదా అంతకన్నా ఎక్కువ), ఆదాయ ధ్రువీకరణపత్రం (నెలకు రూ.15వేలకు మించకుండా), రేషన్‌కార్డు లేదా ఓటర్లుకార్డు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు (అంగవైకల్యం కనిపించే విధంగా ఉండాలి), యుడీఐడీకార్డు తీసుకురావాలి.

ఉపకరణాలు తీసుకోని దివ్యాంగులే అర్హులు...

గత మూడు సంవత్సరాల్లో ఈ ఉపకరణాలు తీసుకున్న వారు అర్హులు కారు. శిబిరాలు సహాయ ఉపకరణాలు కొరకు గుర్తింపు మాత్రమే. శిబిరాలలో ఏ విధమైన వైద్య ధ్రువీకరణపత్రాలు, పింఛన్లు మంజూరు చేయబడవు. అర్హత ఉన్న దివ్యాంగులందరూ ఈ శిబిరానికి హాజరై ఉపకరణాలు పొందవచ్చు.

జిల్లాలో 2వేల మంది దివ్యాంగులకు ఉపకరణాలు



దివ్యాంగుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వారికి ఉపకరణాలు అందించాలనే సంకల్పంతో కేంద్ర సామాజిక సహాయ మంత్రి నారాయణ స్వామికి చేసిన వినతి మేరకు ఆయన ఏడీఐపీ(వివిధ సహాయక పరికరాల సరఫరా పథకం) కింద జిల్లా దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి ఆమోదం తెలిపారు. ఈ మేరకు జిల్లాలో 2వేల మంది దివ్యాంగులు ఉపకరణాలు పొందనున్నారు.

-ఎంపీ బి.వి.సత్యవతి

ఉపకరణాలు అందించడం ఆనందం



దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు ఎంపీ సత్యవతి కృషి అభినందనీయం. కేంద్ర సంస్థతో ఒప్పందం ఏర్పరుచుకొని జిల్లాలో పలు చోట్ల జరిగే శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి. అలిమ్‌కో సంస్థ గతంలో కూడా అనేకమార్లు బ్యాటరీ ట్రైసైకిళ్ల పంపిణీ చేసింది.

– పి.వీరుయాదవ్, దివ్యాంగుల హక్కుల చట్టం జిల్లా కమిటీ సభ్యుడు

ఉక్కుపరిరక్షణ యాత్రను జయప్రదం చేయండి



ఉక్కు పరిరక్షణ యాత్ర పోస్టర్లు ప్రదర్శిస్తున్న సీపీఎం నేతలు

అనకాపల్లి రూరల్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 20 నుంచి వచ్చే నెల 6 వరకూ ఆరు ఉత్తరాంధ్ర జిల్లాల్లో సీపీఎం తరపున చేపట్టనున్న ఉక్కు పరిరక్షణ బైక్ యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ కోరారు. శనివారం పట్టణంలోని గవరపాలెం పార్కు సెంటర్ నుంచి పీవీఆర్ నాయుడు,పల్లపు వీధి, అరుంధతీనగర్, వెంకటరెడ్డినాయుడు వీధి దాసరగెడ్డ రోడ్డు మార్గాల్లో సీపీఎం నేతలు పాదయాత్ర చేసి యాత్రకు సంబంధించిన బ్యానర్లు ప్రదర్శించారు. కరపత్రాలను పంచి ప్రచారం నిర్వహించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని,కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామని పలువురు నేతలు అన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి దాడి శివరామకృష్ణ, సీపీఎం సీనియర్లు బాలకృష్ణ, పెంటకోట శ్రీనివాసరావు, ఆర్. శంకర్రావు, కాళ్ల తేలయ్యబాబు, బొప్పె ఉమామహేశ్వర్రావు, బుగిడి నూక అప్పారావు పాల్గొన్నారు.

26న దివ్యాంగుల శిబిరం

కశింకోట: దివ్యాంగులకు ఉపకరణాలు మంజూరు చేయడానికి ఈ నెల 26న అనకాపల్లి ఎఎంఎఎల్ కళాశాలలో దివ్యాంగుల శిబిరం జరుగుతుందని నరసింగబిల్లి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ రెహమాన్ తెలిపారు. ఈ శిబిరంలో బ్యాటరీతో నడిచే మూడు చక్రాల రిక్షాలు, చెవిటి యంత్రాలు, కాలీపర్స్, కృత్రిమ అవయవాలు, బ్లెయిండ్ స్టిక్‌లు, వీల్ చైర్స్ కోసం దరఖాస్తులు స్వీకరించి అర్హులకు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటారన్నారు. మండలంలోని దివ్యాంగులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బొజ్జన్నకొండ అభివృద్ధి అభినందనీయం



బొజ్జన్నకొండను సందర్శించిన బౌద్ధసంఘాల సభ్యులు

అనకాపల్లిటౌన్ : బౌద్ధారామాల్లో ఒకటైన మండలంలో శంకరం బొజ్జన్నకొండ అభివృద్ధికి నోచుకోవడం అభినందనీయమని రాష్ట్ర బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు యెలిచెర్ల హరిబాబు అన్నారు. బొజ్జన్న కొండను బౌద్ధసంఘాలు, బౌద్ధామాభినులతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కొండపై బౌద్ధారామాలు 2వేల సంవత్సరాల క్రితం బౌద్ధబిక్షువుల ఆధ్వర్యంలో నిర్మించబడినవని చెప్పారు. ఈ కొండపై అతి సుందరమైన బుద్ధుని ప్రతిమలు, బౌద్ధ స్థూపాలతో ఎంతో అద్భుతరీతిలో నిర్మించారన్నారు. అటువంటి బొజ్జన్నకొండను అభివృద్ధి చేసేందుకు ఎంపీ బి.వి.సత్యవతి ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కూడా కొండ అభివృద్ధికి బాటలు వేసిన ఎంపీ సత్యవతికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీఎస్ఐ కార్యదర్శి వై.వి.దుర్గారావు, బౌద్ధ సంఘాల సమాఖ్య కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, జిల్లా అధ్యక్షుడు నేలపూడి బాలరాజు, ఉపాధ్యక్షుడు పల్లా బాబ్జీ, సభ్యులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళా



అవగాహన కల్పిస్తున్న ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారి కె. లావణ్య

కశింకోట: కన్నూరుపాలెంలోని రామాలయం వద్ద ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళా ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కె.లావణ్య మాట్లాడుతూ తమ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో కూడా సీజన్ వ్యాధులు, రక్త హీనత , ఇతర వ్యాధులకు మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు యోగా, ధ్యానం ఉపకరిస్తాయని, ప్రతి ఒక్కరూ వీటిని ఆచరించాలన్నారు. యోగాను ఉచితంగా తమ ఆస్పత్రిలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి వ్యాధి నిరోధక మందులు పంపిణీ చేశారు. యోగాసనాలు వేసి ఉపాధ్యాయులు యోగాపై అవగాహన కలిగించారు. ఎంఎస్‌వో శివ, యోగా ఉపాధ్యాయులు ఆర్.శ్రీను, పి.సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి సత్యారావు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

చదువుకున్న కళాశాలలోనే ఉద్యోగాల కల్పన



ఉద్యోగ మేళాలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: యువత ఉద్యోగ అవకాశాల కోసం ఎక్కడికో వెళ్లాల్సినవసరం లేకుండా విద్యనభ్యసించిన కళాశాలలకే కంపెనీలు క్యూ కడుతున్నాయని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక డీవీఎన్ కళాశాలలో శనివారం జరిగిన ఉద్యోగ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ కళాశాల లక్ష్యమన్నారు. 15 మల్టీనేషనల్ కంపెనీల నుంచి హాజరైన ప్రతినిధులు 500 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లిరమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు ఎస్.భాగ్యలక్ష్మి, షేక్ ఫ్యారిమా, ఎస్ఆర్.జమీర్, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోరున వర్షం.. రైతుల ఆనందం

కశింకోట: కశింకోట ప్రాంతంలో శనివారం రాత్రి పెద్ద ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. రైతుల్లో ఆనందం నింపింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. సుమారు గంటపాటు వర్షం కురిసింది. ఈ వర్షం వరి నాట్లు, వరి పొలాలకు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు. వర్షం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న దిశ ఎస్ఐ సావిత్రి

తుమ్మపాల: ర్యాగింగ్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని దిశ ఎస్ఐ సావిత్రి హెచ్చరించారు. రేబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ర్యాంగింగ్ పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని చెప్పారు. రుణ యాప్‌లు, సైబర్ నేరాలను విద్యార్థులు అప్రమత్తతతో ఎదుర్కొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ వేదవతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గ్రామాలాభివృద్ధి



పెదగుమ్మం వీధిలో సిమెంట్ రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కనకమహాలక్ష్మి వీధిలో డ్రైనేజీ ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోట పంచాయతీ పరిధిలోరూ.90 లక్షలతో కస్పావీధి, కుమ్మరి వీధి, గాడి వీధి, కనకమహాలక్ష్మి వీధి, పెదగుమ్మం వీధి,శిలపరశెట్టి వీధి ప్రాంతాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, సామాజిక భవనాలను శనివారం పర్యటించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా రూ. కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారన్నారు. సచివాలయంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.20 లక్షలు వంతున సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించారన్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు ఈ నిధులతో సిమెంట్ రోడ్లు, కాలువలు, సామాజిక భవనాలు నిర్మిస్తున్నామన్నారు. గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని ఎప్పటికపుడు పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, మండల వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్‌వైజ్‌మెన్, ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ జి. సత్యనారాయణ, పంచాయతీ డీఈ వేణుగోపాలరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ పాలకవర్గం బాధ్యతల స్వీకారం



చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సకలా రాజ్యలక్ష్మి

అనకాపల్లిటౌన్ : పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ తగిన గుర్తింపు ఇవ్వడానికి కృషి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన నూతన ధర్మకర్తల మండలి పదవీబాధ్యతల ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఆలయ కమిటీ ధర్మకర్తలుగా సకలా రాజ్యలక్ష్మి, సూరిశెట్టి చిన సన్యాసిరావు, బెల్లాన అనురాధ ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు జరిగిన చైర్మన్ ఎన్నికల్లో చైర్మన్‌గా సకలా రాజ్యలక్ష్మి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అంతకుముందు సకలా రాజ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. రాజ్యలక్ష్మి గోవిందరావు దంపతులను పలువురు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయ డైరెక్టర్ జి.రామ్మూర్తి, నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, యువజన విభాగం జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, భోగలింగేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి, సిద్ధిలింగేశ్వరస్వామి, కనకదుర్గమ్మ ఆలయాల చైర్మన్లు ఆళ్ల నాగేశ్వరరావు, కెఎం.నాయుడు, నుదురుపాటి తాతాజీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండా రమేష్‌గుప్త, త్రినాథ్, మాజీ కౌన్సిలర్లు పలకా రాము, సత్యనారాయణ, మదన్‌మోహనరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి

అనకాపల్లి రూరల్ : గ్రామాల్లో కీలకమైన సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనసుతో పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి కోరారు. శనివారం పట్టణంలోని దొడ్డిరామానాయుడు భవనంలో జరిగిన జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ సంఘం సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న జీతభత్యాల పెంపు, ఇతర ముఖ్య సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అవసరమైన ఎన్నో రకాల సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల కనీస వేతనాన్ని నెలకు రూ.26 వేలకు పెంచాలని కోరారు. గ్రాట్యూటీ,పింఛను అమలు చేసి, టీఏ, డీఏలు పెంచాలని, విధి నిర్వహణకు ఒకే యాప్ ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంకోసం ఈ నెల 25న జిల్లా ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగశేషు, గౌరవ అధ్యక్షురాలు జి. కుమారి, కోశాధికారి వీవీ రమణమ్మ, కాసులమ్మ, వెంకటలక్ష్మి, జయ పాల్గొన్నారు.

ఉక్కు యాత్ర ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

కశింకోట: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సీపీఎం చేపట్టిన బైక్ యాత్రకు మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. కశింకోటలో ఉక్కు రక్షణ యాత్ర గోడ పత్రికను శనివారం ఆవిష్కరించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉత్తరాంధ్ర బైక్ యాత్ర సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టారని, ఈ యాత్ర జిల్లాకు వస్తున్న సందర్భంగా ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని మద్దతు తెలపాలన్నారు. ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి, ప్రతినిధులు యు. సత్తిబాబు, జి. దొరబాబు, ఎస్. శ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెన్షన్ విధానంపై న్యాయం చేయాలి



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న పీఆర్టీయూ నేతలు

అనకాపల్లిటౌన్: జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కశింకోటలో శనివారం కలిసి పీఆర్‌టీయూ కోరారు. ఈ మేరకు వారు మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు జిల్లా అధ్యక్షులు జి.గాంధీ, జిల్లా కార్యదర్శి సీహెచ్.పెద్దినాయుడు, నేతలు పాల్గొన్నారు.

పట్టణానికి చేరుకున్న యూటీఎఫ్ ప్రచార జాతా



యూటీఎఫ్ ప్రచార జాతాకు స్వాగతం పలుకుతున్న జిల్లా నేతలు

అనకాపల్లి రూరల్: ఉపాధ్యాయుల సేవలో 50 ఏళ్లుగా నిబద్ధతతో పనిచేస్తున్న సంఘం యూటీఎఫ్ ఒక్కటేనని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆ సంఘం రాష్ట్ర ప్రచార జాతా శనివారం అనకాపల్లి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిర్భావం నుంచీ యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తోందన్నారు.స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకుడు ఎల్లయ్యబాబు ఆవిష్కరించారు. పతాక గేయాలు ఆలపించిన తర్వాత ముఖ్య నేతలు ప్రసంగించారు.పలువురు సంఘం 50 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తు చేశారు. అంతకుముందు రాష్ట్ర ప్రచార జాతాకు స్థానిక యూటీఎఫ్ నేతలు స్వాగతం పలికారు. పట్టణంలో బైకు జాతా నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి,ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్,యూనీస్,దేవి పాల్గొన్నారు.

మహిళాబిల్లు చరిత్రాత్మకం

- ఎంపీ సత్యవతిని అభినందించిన యూటీఎఫ్ నేతలు



ఎంపీ సత్యవతిని అభినందిస్తున్న యూటీఎఫ్ నేతలు

అనకాపల్లి రూరల్: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన సందర్భంగా అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతిని శనివారం జిల్లాకు చెందిన యూటీఎఫ్ నేతలు అభినందించారు. మహిళా బిల్లు ఆమోదానికి జైకొట్టిన ఎంపీ సత్యవతిని ఆమె నివాసంలో కలిసిన వారంతా పుష్పగుచ్ఛం ఇచ్చి తమ అభినందనలు తెలియజేశారు.

2029 వరకూ కాకుండా తక్షణమే అమలు చేస్తే బాగుండేదని యూటీఎఫ్ నేతలు ఎంపీతో తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. చరిత్రాత్మకమైన మహిళా రిజర్వేషన్ చట్టం చేసిన సభలో తాను కూడా ఉండడం, బిల్లుకు అనుకూలంగా ఓటు వేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు ఎంపీ సత్యవతి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి,ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్, సభ్యులు గేదెల శాంతిదేవి పాల్గొన్నారు.

శారదానది ఘాట్ వద్ద లైటింగ్



ఘాట్‌ను పరిశీలిస్తున్న ఆడారి కుమారస్వామి, సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక శారదానది ఘాట్ జీవీఎంసీ సహకారంతో లైటింగ్, జనరేటర్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి చెప్పారు. నదివద్ద ఏర్పాటు చేసిన లైటింగ్‌తోపాటు జనరేటర్‌ను ఆయన శనివారం కమిటీ సభ్యులతో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులు నవరాత్రులు పూర్తయిన వెంటనే ఇక్కడి నదిలో నిమజ్జనం చేస్తారని, వారి సౌకర్యార్థం జీవీఎంసీ విద్యుత్ ఏర్పాట్లపై విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు.